# ఆమె కథ

అరుణ రమణకు కావాలి!!

అతను ఆమెను కోరుతున్నాడు - ఆమె రమణను వాంఛించటం లేదు-

కారణం?!-

అరుణ కిరణాల కాంతిని రెట్టింపు చేయలేదు రమణ. బోలెడు లేనివాడు! ఒక యల్డీ!!

రోజుకో పిక్చరు చూపించలేదు.

స్కూటరు వెనుక కూర్చోపెట్టుకుని వూరంతా తిప్పలేదు.

పూటకో టెర్లిన్ చీర కొనివ్వలేదు.

రమణ కాటనుగుడ్డలు లైక్ చెయ్యదు అరుణ-

కానీ...

ఆమె అవయవాల సొంపును, అంగ విన్యాసాన్నీ, ఓర చూపులను గిలిగింతలుపెట్టే నవ్వునూ కోరుతున్నాడు.

సాధ్యంకాని ఆలోచన-

పచ్చగా కంటికి అవుపించే వారినెత్తిన బురదపూసి పల్టీలు కొట్టిస్తుందని, జేబులు ఖాళీ చేస్తుందనీ తెలుసు.

రంభలా నవ్వుతుందని...తనకింత మట్టచెప్పి వాడను కుంటే నక్షత్రకుడిలా వెంటబడుతుందనికూడా తెలుసు.

మాన్యాలున్న వాడ్నిసైతం జలగలాగ పీల్చి పిప్పిచేసి బికారిని చేయగలదని కళ్ళారా చూచి తెల్సుకున్నాడు.

అయినాసరే...ఆమె అతనిక్కావాలి.

ఆమె ఒడిలో ఒక్క క్షణం మైమరిచి నిద్రపోవాలి. వెచ్చని వలపుజల్లు ఆమె తనపై చిలకరించాలి. ఇంకాఎన్నో ఆనందాలు ఆమె అతనికి పంచి యివ్వాలని వాంఛిస్తున్నాడు.

అన్నీ డే డ్రీమ్సుగా మిగిలిపోతున్నాయి-

కొత్తవాడెవడైనా కన్పిస్తే కళ్ళు చక్రాల్లాగ తిప్పి తమాషాగా చూస్తుంది వాడి గుండె కోస్తుంది - తర్వాత సర్వస్వాన్ని అర్పించి ఆర్పేస్తుంది. అదే వ్యక్తి పాత పరి చయం పురస్కరించుకుని మరోమారు పలుకరిస్తే...ఆమె చూపులు కొత్తగా వుంటాయ్. షెర్లిన్ చొక్కా జేబులో మళ్ళీ కొంత కన్పిస్తే...కథ సుఖాంతమే అవుతుంది.

ఆమె గతం, వర్తమానం అంతా రమణకు తెలుసు. తెలుసు. భవిష్యత్తు మెలా వుంటుందోకూడా వూహించ గలడు.

వ్యక్తిత్వం, మంచితనం, ప్రాపకం, పాతివ్రత్యం

పెంచుకునేందుకు కట్టు కథ లెన్నో అల్లి కళ్ళనీళ్ళు పెట్టు కుంటుంది.

ఎన్నో కళ్ళబొల్లి కథలు అల్లుతూ జీవితం నెట్టు కొస్తున్న ఆమె వెనుక జీవిత కథనంకూడా వుంది.

అరుణ సంపాదనే సంసారానికి ఆధారం!!!

తండ్రి పోయాడు.

అప్పులు చేసి అమ్మ చదువు చెప్పించిన కారణంగా అరుణ పెరిగి పెద్దదైంది.

బాగా బ్రతికిన వాళ్ళు-

తండ్రి బ్రతికున్న రోజుల్లో జల్సాలకు, విలాసాలకు వున్న ఆస్తి, ఐశ్వర్యం, హారతిలా హరించి పోయింది.

తాగుడులో తిరుగుబోతుతనంలో, పేకాటలో పోంది పోగా అప్పులు మాత్రం మిగిల్చాడు తండ్రి.

సంపద పోయినా అలనాటి అలవాట్లు, హోదాలు ఏ మాత్రం సంసారంలో తిరుగుముఖం పట్టలేదు.

చదువుకున్న అరుణకు వుద్యోగం దొరకలేదు.

సంసారం గడవటం కష్టమైంది.

ఆమె తర్వాత ఇద్దరు చెల్లెళ్లు, ఇద్దరు తమ్ముళ్ళు, వృద్ధాప్యంలో వున్న అమ్మ—వీరంతా యెట్లా బ్రతకటం అనే సమస్య యెదురైంది.

సమస్యా పరంపరల మధ్య నలిగి పోతోంది సంసారం.

అలవాట్లు మార్చుకుని వున్నదాంట్లో బ్రతకగల మార్గం అన్వేషించలేని అమ్మ, అరుణ వయసు వొంపులను వుద్రిక్తపర్చింది—అమ్మ లేదన్పించింది అరుణకు.

హోదా, డబ్బు పలుకుబడి, పూటకో చీర, రోజుకో సినిమా... వారానికో చెప్పులజత...అవే ఆమె భవిష్యత్తునుకుని గుడ్డిగా ముందుగా నడుస్తోంది. ముళ్ళబాటలో ప్రయాణం సాగిస్తోంది అరుణ. మంచినిగురించి ఆలోచన్లేదు. ఆత్మవంచనచేసుకుని బ్రతుకు బండలు చేసుకుని సమాజంలో ఒక కుళ్ళు మనిషిగా జీవిస్తున్న విషయం ఆకళింపు చేసుకో లేకపోతోంది–

డబ్బు గడ్డితినిపిస్తోంది-గుడ్డిగా ముందుకునడిపిస్తున్నది.

పరిస్థితులకు లొంగి పోయింది. డబ్బుకు లొంగి పోతోంది. సుఖంతో బాటు చేతినిండా డబ్బు కన్పిస్తోంది. సంసారాన్ని సుఖంగా దర్జాగా బ్రతికించ గల్గుతోంది.

కానీ...

నెత్తురు వుడికిపోతోందనే విషయం గ్రహించటంలేదు. కండలు కరిగిపోయి, మాంసం ముద్దకట్టుకుపోతున్నదనే ఆలోచనే లేదు.

యవ్వనం కవ్విస్తోంది–డబ్బుకు అమ్ముడు పోతోంది.

ఇంకా ఆమెనుగురించే రమణ ఆలోచన. అరుణను అనుభవించలేక పోతున్నందుకు సిగ్గుపడుతున్నాడు.

ఆమె పరిసరాలకుపోగల తాహతు, స్థోమత రమణలో లేదు.

అతడ్ని నౌకరులా చూస్తుంది.

ఆమెను మోహినిలా చూస్తున్నాడు తను.

ఆమెను పొందలేక పోతున్నాడనే ఈర్ష్యలేదు—ఆమె రేపటి రోజెలా వుంటుందో నని ఆలోచిస్తున్నాడు.

*　　　*　　　*

కాలచక్రం దొర్లిపోతోంది-

వసంతా లెన్నో మళ్ళిపోతున్నాయి.

రమణ తల్లో తెల్లవెంట్రుకలు మొలకెత్తాయి.

ఉద్యోగరీత్యా ఆ వూరు ఈ వూరు తిరిగి తిరిగి మళ్ళీ తనవూరు చేరుకున్నాడు.

అరుణ గుర్తొచ్చింది.

రమణ ఆలోచన్ల నడుమ అరుణ మోహినిలా నిల్చుంది. రంభలా నవ్వింది.

ఆమె నొకసారి చూడాలని మనసు తహతహ లాడుతోంది.

ఊరు ఎంతో మారింది.

మనుషులు మారేరు - మనసులు మారేయి.

24 అంగుళాల పాంట్లు తొడిగేవారు 18 అం. గొట్టం పాంట్లు తొడుగుతున్నారు.

నాగరికత మారింది.

సైడుకాలవల్లో పారే నీరు మరింత సుగంధాన్ని వెదజల్లుతోంది.

ఫేషన్లతో, ఫాల్సు నాగరికతతో జనం నవనవ లాడుతున్నారు.

అందం ఎక్కువైంది. అడుక్కుతినేవాళ్ళు ఎక్కువైనారు. మోసం మితిమీరింది. మగా ఆడా తేడా ధుస్తుల్లోనేకాదు మనుష్యుల్లో కూడా మారినట్లు అర్థంచేసుకోగలిగలిగాడు రమణ.

భూతు బలిసిపోయింది. ఆడాళ్ళు సిగరెట్లు కాలుస్తు

న్నారు, క్లబ్బుల కొస్తున్నారు-ఖరీదైన మధుర పానీయాలు సేవిస్తున్నారు—

దేవుడు గుడిలో జనం పల్చబడ్డారు.

బార్ రూములో...కాఫీహోటళ్ళలో, జనసందోహం యెక్కువైంది.

రోమియోలు పెరిగారు-లాడ్జింగుల్లో ఖాళీలు దొరకటం లేదు.

స్వేచ్ఛా, స్వాతంత్ర్యం మితిమీరినయి-

నవ్వుకున్నాడు రమణ!!! -

శ్రీమతి హాస్పిటల్లో వుంది-

సాయంత్రం ఐదుగంటలు కావస్తోంది -

ఆఫీసునుండి ఇంటి కొచ్చాడు - భార్యను చూచేందుకు హాస్పిటల్‌కు బయల్దేరేడు రమణ.

రోడ్డువెంట నడుస్తున్న రమణ ఆలోచన్ల నడుమ అరుణ నిల్చుంది. ఎంతమందిని అడిగినా ఆమె ఆచూకీ తెలీ లేదు. మళ్ళీ చూడలేకపోయినందుకు నిరుత్సాహ పడ్డాడు.

సంతర్పణకో, సమారాధనకో వచ్చిన బంధుమిత్ర పరి వారంలాగ హాస్పిటల్ ప్రహరీగోడకు రెండు వైపులా బోలెడు మంది వికలాంగులు, అనాథలు, అడుక్కుతినే సోమరి పోతులూ ఇంకా యెందరో కూర్చొన్నారు.

వారిని చూచేసరికి జాలేసింది.

జేబులోకి చెయ్యిపోనిచ్చాడు.

చేతికి తగిన చిల్లర తలొకటీ ఇచ్చుకుంటూ ముందుకు నడుస్తున్నాడు.

కాళ్ళకు బ్రేకులు పడ్డయి...

కుష్టువ్యాధితో బాధపడుతున్న ఆడపడుచును చూచే సరికి హృదయం ద్రవించింది.

చూచేందు కెంతో వికృతంగావుంది. అయినా బ్రతికే వుంది.

ముసిరే ఈగలు తోలుకుంటూ, నెత్తురు చీము కలిసి శరీరంలోంచి ప్రవహించే రసికను గుడ్డ పేలికలతో తుడుచు కుంటోంది. కనుబొమలు కొరుక్కుపోయినయి. పాడైన పరుపులో దూదిలాగ శరీరంలో మాంసం ముద్ద గట్టుకుపోయి వళ్ళంతా యెగుడు దిగుడుగావుంది. వేళ్లు వంకర్లు తిరిగినయి-

రమణ కళ్ళముందు గతం గిర్రున తిరిగింది.

'ఆమే! - అరుణే!!' - పోల్చుకోగలిగేడు.

తిరిగి ఆమెను చూడగలిగినందుకు ఆనంద పడుతున్నాడు. ఆమె పరిస్థితికి ఏహ్యపడ్లేదు.

సమాజంలో ఒక మంచి మనిషిగా బ్రతక్కుండా జీవితాన్ని, బ్రతుకునూ బండలు చేసుకున్న అరుణ చరమావస్తకు చకితుడయ్యాడు క్షణంపాటు.

యవ్వన మకరందాన్ని పశుప్రాయంగా పదిమందికీ పంచిపెట్టి...ఈనాడు యింతటి దారుణమైన అవస్థలో, యెవ్వరి అదరింపుకూ నోచుకోక...చావు బ్రతుకులమధ్య ఇంకా యెందుకు బ్రతికీవుంది...ఆత్మహత్యకు పాల్పడక పోయిందేమనే ప్రశ్న రమణ తలంపుకు రాలేదు.

రమణ సంఘ సంస్కర్త కాదు.

ఆపద్బాంధవుడూ, ఆర్తరక్ష పరాయణుడూ అంతకంటే కాదు.

సమాజంలో బ్రతుకుతున్న నూటికి నూరుపాళ్ళ మానవత్వమున్న మనిషి రమణ.

అందుకే ఆమె పరిస్థితి చూసేసరికి జాలి, అంతఃకరణ పెరిగాయి.

'ను...వ్వ...' పలుకరించాడు.

ఆమె రమణను పోల్చుకోలేకపోయింది.

ఆమె పాపానికి నిష్కృతిలేదు అన్పించలేదు - ఆమె పతనానికి నాందీవాక్యం పలికిన య్యవనపు వేడి నెత్తుటిమీద అసహ్యం, ఆక్రోశం, ఎక్కువైంది.

ఆప్యాయంగా ఆమెను స్పర్శించబోయాడు.

బాధతో, భయంతో, సిగ్గుతో, అభిమానంతో అవమానంతో కుంచించుకు పోతున్న అరుణ తనను తాక వద్దని తల ఆడిస్తూ వెనక్కు జరిగింది.

ఆమె జీవిత శేషాన్ని మార్చివేయా లన్పించింది.

రిక్షా పిల్చాడు.

రిక్షాలో అరుణను తన సరసన కూర్చోబెట్టుకుని 'లెప్రసీ హాస్పిటల్' వైపు రిక్షాని తీసుకెళ్ళ మన్నాడు.